## జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం భవనం వర్చువల్‌గా ప్రారంభం



**మహబూబ్‌నగర్, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి-కమ్-జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థానం భవనాన్ని తెలంగాణ హైకోర్టు, మహబూబ్‌నగర్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి న్యాయమూర్తి ఎన్.వి. శ్రావన్ కుమార్, హైదరాబాద్ నుండి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి తో కలిసి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు.స్థానికంగా జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం. ప్రేమలత, దేవరకద్ర ఎమ్మెల్యే జీ. మధుసూదన్ రెడ్డి, రిబ్బన్ కట్ చేసి న్యాయస్థానం భవనాని ప్రారంభించారు.కొత్త న్యాయస్థానం ప్రారంభం ద్వారా దేవరకద్ర మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ అవుతాయని, కేసుల విచారణ వేగవంతం కావడంతో పాటు ప్రజలకు సమయపాలనతో కూడిన న్యాయ సేవలు అందుబాటులోకి రానున్నాయి.ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్.పి. డి. జానకి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి(డి.ఎల్.ఎస్.ఎ) ఇందిర, ఇతర అధికారులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ప్రమాణ స్వీకారం



**నేరేడుచర్ల, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** నేరేడుచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కొప్పుల రాంరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రాంరెడ్డి మాట్లాడుతూసంఘం ద్వారా రైతులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానని , చైర్మన్ ఎన్నికకి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి ,మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ళ సురేష్ రెడ్డి, పత్తేపురం సర్పంచి కోనుగంటి సూజాత సోమిరెడ్డి, సంఘ డైరెక్టర్లు దేవులపల్లి శంకరాచారి, వేముల జయమ్మ ప్రాంచీస్, నూకల వెంకట్ రెడ్డి సఫావత్ భీక్యా, కుసుమ శేఖర్ రెడ్డి ,రైతులు పాల్గొన్నారు.

## దిశ కమిటీ సమావేశానికి అన్ని నివేదికలు సిద్ధం చేసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** రేపటి దిశ కమిటీ సమావేశానికి సంబంధించి అన్ని నివేదికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం కలెక్టర్ దిశ కమిటీ సమావేశ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంబంధిత ప్రజాప్రతినిధులందరికీ దిశ కమిటీ సమావేశానికి సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రతి అధికారి వారి శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలు పొందిన లబ్ధి వివరాల నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. నివేదికలు పారదర్శకంగా ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, పథకాల వివరాలను సమీక్షించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో బీసీలకు అంగన్‌వాడీ పోస్టుల్లో అన్యాయం

### - బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి



**గద్వాల, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** జోగులాంబ గద్వాల జిల్లాలో ఇటీవల విడుదలైన అంగన్‌వాడీ నియామక నోటిఫికేషన్‌లో బీసీలకు ఒక్క పోస్టు కూడా రిజర్వు చేయకపోవడంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్. రామచంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అయిజ పట్టణంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 73 అంగన్‌వాడీ కేంద్రాల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ, బీసీ అభ్యర్థులకు ఒక్క పోస్టు కూడా కేటాయించకపోవడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. రాష్ట్రంలోనే కాదు, జిల్లాలో కూడా బీసీలే అధిక జనాభా కలిగిన వర్గమని, అలాంటి పరిస్థితిలో వారికి ప్రాతినిధ్యం లేకపోవడం అన్యాయమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన పేరుతో గొప్పలు చెప్పుకుంటూ, మరోవైపు బీసీలకు ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించకపోవడం విరుద్ధ ధోరణిగా ఉందని ఆయన ఆరోపించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారా అని ప్రశ్నించారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలో విడుదలైన అంగన్‌వాడీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించి, రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా సవరించిన కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో బీసీలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అయిజ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, సీనియర్ నాయకుడు భగత్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, నాయకులు భీమన్న, మహేష్, ప్రదీప్, స్వామి, శివతో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేసేలా వేగంగా పనిచేయాలి


### - అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్..




**వనపర్తి, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసిన వేగంగా పనిచేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై తహసీల్దార్లు, సూపర్వైజర్లు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా అదరపు కలెక్టర్ మాట్లాడుతూ .. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ( ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బిఎల్వోలు ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ సమయంలో ఓటర్లు పూరించిన అన్ని వివరాలను సమగ్రంగా వెరిఫై చేయాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని నేటితో పూర్తిచేయాలని .. ఫారాలను పంపిణీ చేయడంతో పాటు వాటిని సక్రమంగా ఎలా నింపాలో ఓటర్లకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఫారాల పంపిణీ నెమ్మదిగా సాగుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, అక్కడ పంపిణీ వేగవంతం చేయాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమయపాలనతో పని చేయించేలా తహసీల్దార్లు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర ఎన్నికల అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు లేకుండానే 9, 10 తరగతులు?

- శ్రీ చైతన్య గాయత్రి నగర్ బ్రాంచ్‌పై ఫిర్యాదు
- బాలాపూర్ ఎంఈఓకు కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ వినతి
- సమగ్ర విచారణ, గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్

**హైదరాబాద్, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ గుర్తింపు 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు మాత్రమే ఉన్నప్పటికీ, అక్రమంగా 9వ, 10వ తరగతులను నిర్వహిస్తున్నారంటూ శ్రీ చైతన్య గాయత్రి నగర్ బ్రాంచ్‌పై కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ బాలాపూర్ మండల విద్యాధికారి (ఎంఈఓ) కృష్ణయ్యకు ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జేఏసీ ప్రతినిధులు కోరారు. పాఠశాల ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు, టీఆర్ఎస్వీ నాయకులు సాయికుమార్, యోగేష్ యాదవ్ మాట్లాడుతూ.. 1 నుంచి 8వ తరగతి వరకు మాత్రమే ప్రభుత్వ గుర్తింపు ఉన్నప్పటికీ, పాఠశాల యాజమాన్యం 9, 10 తరగతులను నిర్వహిస్తూ తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తోందని ఆరోపించారు. అంతేకాకుండా, ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఎస్ఎస్‌సీ గుర్తింపు ఉన్న ఇతర పాఠశాలల్లో నమోదు చేయడం ద్వారా విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వారు ఆరోపించారు. ఇది విద్యా రికార్డుల విశ్వసనీయతను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్-1982 ప్రకారం ప్రభుత్వ గుర్తింపు లేని తరగతులను నిర్వహించడం చట్టవిరుద్ధమని, గుర్తింపు ఉత్తర్వుల్లో అనుమతించిన తరగతుల వరకు మాత్రమే బోధన నిర్వహించాలని నిబంధనలు స్పష్టంగా పేర్కొంటున్నాయని జేఏసీ నాయకులు తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో 9, 10 తరగతులు నిర్వహించడం గుర్తింపు నిబంధనల ఉల్లంఘన అవుతుందని పేర్కొన్నారు. అనుమతి లేని తరగతులకు అడ్మిషన్లు తీసుకుని తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్య అని ఆరోపించారు. దీంతో పాటు ప్రభుత్వ పర్యవేక్షణ వ్యవస్థను బలహీనపరచడమే కాకుండా, ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

అనుమతి లేని విద్యా కేంద్రాల్లో చదివే విద్యార్థుల విద్యా హక్కులు, సర్టిఫికెట్ల ప్రామాణికత, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దే సమయంలో అక్రమంగా 9, 10 తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలకు బాలాపూర్ ఎంఈఓ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ తరగతులు కొనసాగిస్తే గుర్తింపును రద్దు చేసే చర్యలు తీసుకుంటామని యాజమాన్యాలను హెచ్చరించినట్లు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని, అక్రమంగా వసూలు చేసిన ఫీజులను తల్లిదండ్రులకు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, విచారణ నివేదికను ప్రజలకు వెల్లడించాలని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ వ్యవహారం కేవలం విద్యా నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాకుండా, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ప్రజా ప్రయోజన అంశమని పేర్కొంటూ, విజిలెన్స్ విచారణ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా సమగ్ర విచారణ చేపట్టాలని జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది.

## మంత్రి సీతక్కకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందచేసిన మధ్యాహ్న భోజనం వంట కార్మికులు



**ములుగు జిల్లాప్రతినిధి జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు సీతక్క ని కలిసి వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.అందుకు మంత్రి కూడా సానుకూలంగా స్పందించడం జరిగింది. 2023 2024 సంవత్సరానికి సంబంధించిన తొమ్మిది నెలల అల్పాహారం పెండింగ్ బిల్లులను,,మరియు రూపాయలు 10,000 వేతనాల విషయము, మరియు కోడిగుడ్లు, నిత్యవసర వస్తువులు ప్రభుత్వం సరఫరా చేసే విధంగా,,కార్మికులను కూడా కారణాలు లేకుండా తొలగించకుండా ఉండే విషయంలో కూడా,, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి నా వంతుగా కృషి చేస్తాను అని తెలియజేసినారు, అందుకు అక్కడికి హాజరైన వంట కార్మికులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పాల్గొని మాట్లాడుతూ ,,ప్రస్తుతం మార్కెట్లో కోడి గుడ్డు ధరలు రు,,7 నుండి రు,,8 వరకు లభిస్తున్న దృశ్య ప్రభుత్వం ఆరు మాత్రమే చెల్లిస్తా ఉంది కనుక రెండు రూపాయల నష్టం తోని మూడు కోడిగుడ్లు అందించడం సాధ్యం కాదు అని, అలాగే అతి తక్కువ మెనూ చార్జీలు ఇస్తూ రెండు కూరలు వండాలే నాణ్యమైన భోజనాలు అందించాలి అంటే కూడా సాధ్యం కాదు అని అన్నారు. సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలోని శాసనసభ్యులను కలిసే కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది . అందులో భాగంగా మంత్రి ని సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం సీరియస్ గా ప్రయత్నించాలని పరిష్కరించని పక్షంలో ఆగస్టు 15వ తారీకు తర్వాత ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయవలసిన అవసరం ఉంటుంది అందుకు కార్మికులు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా అన్నారు, ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి నాయకులు ముత్యాల రాజు,సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భారతి,,జిల్లా ఉపాధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల కార్మికులు మద్దిబోయిన భారతి, తులసి, సఫియా, అంకం పద్మ, సారమ్మ, శ్రీనివాస్, కమలక్క లక్ష్మి, భాగ్య, స్వరూప, నీలమ్మ, సుమతి, సమ్మక్క,లింగమ్మ, మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**కల్వకుర్తి, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి శుభ్ర పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టవలెనన్న సూచన ఇచ్చారు. బాధితులకి ప్రశాంత వాతావరణం కల్పించాల్సినదని, ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందిస్తూ పారదర్శక విచారణ ద్వారా న్యాయం త్వరగా చేకూర్చాలని హితబోధ చేశారు.ఎస్పీ, డైల్112 ద్వారా వచ్చే కాల్స్‌కు తక్షణ స్పందనను బలంగా అమలు చేయాలని, బ్లూకోర్ట్ సిబ్బంది అంతకుముందే సహాయం అందించాలనీ సూచించారు. స్థానిక రౌడీషీట్ల వేళ్ల గురించి వివరాలను సంపాదించి వారి కదలికలపై నిరంతరంగా నిఘా చేయాలని సంబంధించిన అధికారులకు ఆదేశించారు.గ్రామ స్థాయిలో విధులు నిర్వహించే విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమ పరిధిలో ప్రజలతో సదా అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించగలిగే విధంగా పనిచేయాలన్నారు. రిసెప్షన్, సైబర్ క్రైమ్ వారియర్, సీసీటీవీ ఇంచార్జ్ మరియు ఇతర సిబ్బంది పనితీరును సమీక్షించి వివిధ సూచనలు ఇచ్చారు. పెండింగ్ కేసుల విషయమై వివరాలు కోరుకుని ఎలాంటి కేసులు పెండింగ్ గా నిలవకుండా అవసర చర్యలు తీసుకో వాలని ఎస్ఐ కురు మూర్తిని సూచిం చారు. తనిఖీ ముగింపులో పోలీస్ స్టేషన్ నిర్వ హణ, రికార్డు భద్రత, సిబ్బంది నియమ శాఖపై దృష్టి సారించి సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందిని ప్రత్యేకంగా అభినం దించారు. ప్రజా భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు వ్యవస్థ మరింత బలపరచాలని డా. సంగ్రామ్ సింగ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సి ఐ బీమ్ కుమార్, కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గద్వాల్‌లో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులపై ప్రత్యేక తనిఖీలు

- ప్లాస్టిక్ రహిత గద్వాల లక్ష్యంగా మున్సిపాలిటీ చర్యలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**గద్వాల, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణాన్ని పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గద్వాల మున్సిపాలిటీ ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నియంత్రణపై ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్, మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్ ఆదేశాల మేరకు పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థల్లో అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణదారులకు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగం పూర్తిగా నిషేధించబడిందని అధికారులు స్పష్టం చేశారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ సంచుల స్థానంలో వస్త్ర సంచులు, జూట్ బ్యాగులు, కాగితపు సంచులు వంటి ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. తనిఖీల సందర్భంగా దుకాణాలను పరిశీలించిన అధికారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్న వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని, ప్లాస్టిక్ రహిత గద్వాల లక్ష్య సాధనకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. అదే సమయంలో కిరాణా వర్తకులు సహా వివిధ వ్యాపార సంఘాల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని, ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని దశలవారీగా సమర్థవంతంగా అమలు చేస్తామని అధికారులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, తెలంగాణ ప్రభుత్వ స్వచ్ఛ తెలంగాణ లక్ష్యాలకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య విభాగం అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పిడుగు పాటుకు మరో పది పాడి గేదెలు మృతి



**ములుగు జిల్లా ప్రతినిధి, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దామరవాయి గ్రామపంచాయతీ లోని మద్దెనికుంట సమీప పొలాల్లో గురువారం సాయంత్రం వర్షంతో పాటు పడ్డ పిడుగుపాటుకు 9 పాడి గేదలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి.రెండు రోజుల క్రితం ఇదే మండలంలోని ఓ గిరిజన రైతుకు చెందిన 24 మూగజీవాలు పిడుగుపాటుకు మృత్యువాత పడి న సంగతి తెలిసిందే.

## గుడ్డెందొడ్డి రిజర్వాయర్ డీపీఆర్ సర్వేను పరిశీలించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

- గ్రామానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రిజర్వాయర్ నిర్మాణం
- త్వరలో జీఓ జారీ చేసి పనులు ప్రారంభిస్తామని వెల్లడి



**గద్వాల, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** నియోజకవర్గంలోని ధరూర్ మండలం గుడ్డెందొడ్డి రిజర్వాయర్ డీపీఆర్ సర్వే పనులను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గురువారం పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కంపెనీ ఇంజనీర్లతో కలిసి సర్వే పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గద్వాల నియోజకవర్గంలో తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసి నెట్టెంపాడు--గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు.గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాల ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడ్డెందొడ్డి రిజర్వాయర్ ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించిన విషయాన్ని గుర్తు చేశారు.సర్వే సందర్భంగా గుడ్డెందొడ్డి గ్రామస్థులతో ఎమ్మెల్యే, సర్వే అధికారులు సమావేశమై వారి సందేహాలను నివృత్తి చేశారు. గ్రామానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రిజర్వాయర్ ఆనకట్ట నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే దిగువ ప్రాంత గ్రామాలకు నీటి ఊటలు దెబ్బతినకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణ పనులు చేపడతామని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ సర్పంచ్ రఘువర్ధన్ రెడ్డి, అధికారులు, మైలగడ్డ చంద్రశేఖర్, కురుమన్న, ఇతర నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత...



**వలిగొండ, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** 29 వలిగొండ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పోలెపాక జానకిరాములు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మొదలియార్ రవి కి 52,500 రూపాయల చెక్కును గురువారం లబ్దిదారునికి అందజేశారు.అందజేసిన వారిలో మండల అధ్యక్షులు బత్తిని సహదేవ్,సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి,కాసుల వెంకన్న,రాచమల్ల తిరుపతయ్య,ఎమ్మే మల్లేశం,కొండూరు సాయి,పోలెపాక గోపాల్ తదితరులు పాల్గొన్నారు .

## ప్రభుత్వ పాఠశాలల్లో 34 వేల మంది విద్యార్థుల నమోదు లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**మంథని, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచి, 34 వేల మంది విద్యార్థుల నమోదు లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జీరో నమోదు, 15 లేదా అంతకంటే తక్కువ విద్యార్థుల నమోదు ఉన్న ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.... ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చే ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ) దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత పాఠశాలలు వెంటనే డ్రాప్‌బాక్స్‌లో స్వీకరించి సకాలంలో క్లియర్ చేయాలని ఆదేశించారు. డ్రాప్‌బాక్స్‌లో ఎలాంటి పెండింగ్‌లు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.నిబంధనలు పాటించని, సహకరించని ప్రైవేట్ పాఠశాలలకు వివరణ కోరుతూ చర్యలు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఉపాధ్యాయులందరూ ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు లేదా "ఆన్ డ్యూటీ" నమోదును తప్పనిసరిగా చేయాలని, సెలవులో ఉన్న ఉపాధ్యాయుల దరఖాస్తులను సంబంధిత అధికారులు తక్షణమే ఆమోదించడం లేదా తిరస్కరించడం చేయాలని సూచించారు. ఎఫ్ఆర్ఎస్‌లో తలెత్తే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, హాజరు నమోదులో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో సెక్టోరియల్ అధికారి మల్లేష్ గౌడ్ ,మండల విద్యాధికారులు, సంబంధిత ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కుటుంబంపై కక్షసాధింపు చర్యలు



**వికారాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ అవినీతి, కుంభకోణాలను ప్రశ్నిస్తున్నందుకే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కుటుంబంపై కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయని డాక్టర్ మెతుకు ఆనంద్ ఆరోపించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సతీమణి లక్ష్మీభాయిని అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి తొలగించి, కోఆపరేషన్ శాఖలో అప్రాధాన్య పోస్టుకు బదిలీ చేయడం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ బదిలీ ఉత్తర్వులను ప్రభుత్వం ఈరోజు ఉదయం తక్షణమే జారీ చేయడం వెనుక రాజకీయ ఉద్దేశ్యం ఉందని ఆయన విమర్శించారు. లక్ష్మీభాయికి రావాల్సిన ప్రమోషన్‌ను నిలిపివేసి, ఐఏఎస్ హోదాకు వెళ్లకుండా అడ్డుకోవడం కూడా ఇదే కుట్రలో భాగమని అన్నారు.ఇటీవల రిటైర్డ్ అడిషనల్ డీజీపీ అయిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ప్రభుత్వం భద్రతను తొలగించిందని, వాహన సౌకర్యాన్ని కూడా నిలిపివేయడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఖరిని స్పష్టంగా చూపిస్తోందన్నారు.ప్రజల సమస్యలపై పోరాడుతున్న నాయకులపై ఒత్తిడి తెచ్చేందుకు కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని మెతుకు ఆనంద్ అన్నారు. ఎన్ని కక్షసాధింపు చర్యలు చేసినా ప్రజల పక్షాన ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వం వైఫల్యాలను బీఆర్ఎస్ ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.ఇలాంటి బెదిరింపులు, ఒత్తిళ్లకు భయపడేది ఎవరూ లేరని, ప్రజల కోసం పోరాటం కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు.

## ఎన్ సిసి విద్యార్థులు అగ్నివీర్ కి ఎంపిక



Joyal Wesley, A.Dheeraj, A. Ajay, B.Gopichand, G.Vinay

**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక ఎస్ ఆర్ బిజిఎన్ఆర్ కళాశాల ఎన్ సి సి విద్యార్థులు ఐదుగురు ఇటీవల ప్రకటించిన అగ్నివీర్ కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా గురువారం అభినందన పూర్వక ప్రకటనలో తెలిపారు.జోయల్ వెస్లీ నేవీ విభాగంలో, ధీరజ్,అజయ్, వినయ్, గోపిచంద్ ఆర్మీ విభాగం లో ఎంపికయ్యారని తెలిపారు ఎన్ సి సి విద్యార్థులకు యూనిఫాం ఉద్యోగాల్లో ప్రత్యేకమైన రిజర్వేషన్లతో పాటు అదనపు మార్కులు ఉన్నాయని కళాశాల ఎన్ సి సి ఏఎన్ఓ లెఫ్టినెంట్ డా. ఓంకార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు తోపాటు ఎన్ సి సి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్.కే భద్ర, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పంకజ్ విద్యార్థులను అభినందించారు.భారత సైన్యంలో గొప్ప అవకాశంగా భావించాలని తెలిపారు.

## సర్ -2026 ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య



**ఖమ్మం, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్ – 2026 కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఫారాల పంపిణీ పూర్తిస్థాయిలో జరిగిందా, ఎక్కడైనా పెండింగ్ ఉందా అనే విషయాలను సంబంధిత ఏఈఆర్ఓ లు, సూపర్వైజర్లు, బిఎల్ఓ లను అడిగి తెలుసుకున్నారు. ఫారాల సేకరణ ప్రక్రియను పరిశీలించి, మ్యాపింగ్ కాని ఓటర్లు ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి సిద్ధంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే సేకరించిన ఫారాలు పూర్తిగా నింపబడినాయా లేదా అనే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని, యాప్‌లో వివరాలను ఎలా అప్లోడ్ చేస్తున్నారో, అధికారులను అడిగి తెలుసుకున్నారు.యాప్‌లో వివరాలను నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తతో పనిచేయాలని, ఏఈఆర్ఓ లు, సూపర్వైజర్లు, బిఎల్ఓ లు సమన్వయంతో కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు.

## ఖమ్మం జిల్లాలో యూరియా కొరత లేదు

**: ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**



**ఖమ్మం, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** వానాకాలం–2026 సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు మొత్తం 35,267 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని, జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్ల వద్ద 691.13 మెట్రిక్ టన్నులు (15,359 బస్తాలు), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద 920.02 మెట్రిక్ టన్నులు (20,445 బస్తాలు), మార్క్ ఫెడ్ ఖమ్మం వద్ద 7,656.16 మెట్రిక్ టన్నులు (1,70,137 బస్తాలు), కంపెనీ గోదాముల్లో 991.51 మెట్రిక్ టన్నులు (22,034 బస్తాలు), కమీషనర్ రిజర్వ్ పూల్ (సీఆర్‌పీ)లో 6,898.05 మెట్రిక్ టన్నులు (1,53,290 బస్తాలు) నిల్వ ఉన్నాయని తెలిపారు. 2026 జూలై 2 నాటికి జిల్లాలో మొత్తం 17,156.88 మెట్రిక్ టన్నుల యూరియా (3,81,264 బస్తాలు) అందుబాటులో ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు యూరియా యాప్ ద్వారా 56,926 మంది రైతులు 1,80,738 బస్తాలను బుక్ చేసుకొని, 1,60,316 బస్తాలను కొనుగోలు చేశారని తెలిపారు. యూరియా యాప్ ద్వారా రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను బుక్ చేసుకుని కొనుగోలు చేస్తున్నారని వివరించారు.రైతు సోదరులు ఎలాంటి అపోహలకు గురి కాకుండా అవసరమైన మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని, జిల్లాలో రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ప్రతి మండల పరిధిలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందని, రైతులు యూరియా లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పీఆర్సీ వెంటనే అమలు చేయాలి

**- టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు**



**ఏన్కూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తెలంగాణ రెండవ పీ ఆర్సీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని 2023 జూలై నుంచి అమలు కావలసిన నూతన పి ఆర్సీ పై ప్రభుత్వం వెంటనే నివేదిక తెప్పించుకొని సంఘాలతో చర్చించి అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల,బాలుర ఉన్నత పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్ సభ్యత్వ క్యాంపెయిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మూసివేసిన ప్రతి పాఠశాలలను తెరిపిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు పాఠశాలల సంఖ్యను కుదిస్తామనటం సమంజసం కాదని, వెంటనే ఆ ఆలోచనను విరమించుకోవాలన్నారు. హెల్త్ కార్డుల విధి విధానాలను రూపొందించి వెంటనే అమలు చేయాలని, 2024 మార్చి నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలన్నారు . పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, నిత్యావసర ధరలు పెరుగుతున్నందున పెండింగ్లో ఉన్న ఆరు డిఎ లను వెంటనే విడుదల చేయాలన్నారు. హెల్త్ కార్డులపై వెంటనే వైద్యం అందించాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న పండిట్స్ పిఈటీ పోస్టులను అప్గ్రేడ్ చేస్తూ పదోన్నతి కల్పించాలన్నారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీ, యుఆర్ఎస్ సిఆర్టి ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామ్ చంద్,మూడ్ పుల్లయ్య, ఉపాధ్యక్షురాలు వి. శ్రీదేవి,కోశాధికారి బి. నరసింహారావు టీఎస్ యుటిఎఫ్ సీనియర్ నాయకులు రాఘవరావు, శంకర్రావు, మండల నాయకులు బి.రవికుమార్, జి.శైలజ,ఏ.కృష్ణ బి. లక్ష్మ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కి విశేష స్పందన - నూతి



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షులు కాపా మురళి కృష్ణ ఆధ్వర్యంలో ఉచిత బీపి, షుగర్ టెస్ట్ లు నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సూచన మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ల సహకారంతో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ప్రతి గురువారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని అందులో భాగంగా స్వయంగా దరఖాస్తులు స్వీకరించానని ప్రజా శ్రేయస్సు కొరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. అదే విధంగా జిల్లాలోని ప్రజలు ఈ అవకాశంను వినియోగించుకోవాలని కోరారు. అదే విధంగా జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షులు కాపా మురళి కృష్ణ ఆధ్వర్యంలో ఉచిత బీపి షుగర్ టెస్ట్ లు నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా రాబోవు రోజులలో పేద ప్రజల సౌకర్యార్థం ఉచిత హెల్త్ క్యాంప్ లు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్,పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, సీనియర్ కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వరరావు,కమర్తపు మురళి, రుద్రగాని ఉపేందర్,జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు తూములూరి లక్ష్మీ నరసింహారావు,కిలారు అనిల్ కుమార్,కల్వకుంట్ల గోపాల్, బచ్చలకూర నాగరాజు,కొట్టె రాజశేఖర్,గొల్లపూడి వీరయ్య, బండి మాధవరావు, దామా స్వరూప,జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, గజ్జి సూర్యనారాయణ, ఏలూరి రవికుమార్, జెగ్రిపోతుల అంజనీ కుమార్, ఆజ్గర్, ఫరీద్ ఖాద్రి,సుగుణ,ప్రతిభారెడ్డి, లక్ష్మీ,శ్రీలత, శివ నాయక్, బండి నాగేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# నిర్ణీత షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు పూర్తి చేయాలి : ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- వైరా కేంద్రంలో అత్యాధునిక సదుపాయాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం
- విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక విద్యకు అనుగుణంగా అన్ని వసతుల కల్పన
- వైరా నియోజకవర్గ కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం, జూలై 03 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.గురువారం వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా వైరా పట్టణంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ ప్రాంతాలను కాలినడకన పరిశీలిస్తూ భవనాల నమూనా మ్యాపులు, పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల రాకపోకలకు అనువుగా లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికా బద్ధంగా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ప్రపంచస్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంలోనూ రాణించేలా అత్యాధునిక మౌలిక వసతులతో ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.సమాజంలోని అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన, సమాన అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలను నిర్మిస్తోందని పేర్కొన్నారు. సామర్థ్యం కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అవసరమైన విద్యా వాతావరణాన్ని ఈ గురుకులాలు అందిస్తాయని అన్నారు.నిర్మాణ సంస్థలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట వైరా తహసీల్దార్ సురేష్, మున్సిపల్ కమిషనర్ రామచందర్ రావు, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి

## - ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ఖమ్మం,జూలై 03(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని, ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు చదువు మీద శ్రద్ధ చూపెడతారనీ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా కొణిజెర్ల మండలం పల్లిపాడు గ్రామం లోనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత, తరగతి గదులు, మరుగుదొడ్లు, త్రాగునీటి వసతి, వంటగది నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ మధ్యాహ్న భోజనం చేశారు. పిల్లలకు వడ్డిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.భోజనం రుచిగా ఉందా, మెనూ ప్రకారం గుడ్డు, వెజిటబుల్ బిర్యానీ, పప్పు, సాంబారు అందిస్తున్నారా, ఆహారం పరిశుభ్రంగా తయారవుతోందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో కీలకమని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం వినియోగించాలని, ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసి తాజా కూరగాయలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులతో నిరంతరం సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కొణిజెర్ల తహసీల్దార్ అరుణ, వైరా మున్సిపల్ కమీషనర్ రామచందర్ రావు, ఎంఈవో చావా శ్రీనివాస రావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 4 ఎకరాల వరకు ఉన్న రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ

## - ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** వానాకాలం–2026 సీజన్‌కు సంబంధించి 4 ఎకరాల వరకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం క్రింద ఆర్థిక సహాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 2,98,513 మంది రైతులకు 255.75 కోట్లు రైతు భరోసా నిధులు జమ చేసినట్లు తెలుపుతూ, నియోజకవర్గాల వారీగా రైతు భరోసా జమ వివరాలు వెల్లడించారు.ఖమ్మం నియోజకవర్గంలో 16,197 మంది రైతులకు రూ.14.69 కోట్లు, పాలేరు నియోజక వర్గంలో 71,029 మంది రైతులకు రూ.58.08 కోట్లు, సత్తుపల్లి నియోజక వర్గంలో 74,682 మంది రైతులకు రూ.62.19 కోట్లు, మధిర నియోజకవర్గంలో 78,832 మంది రైతులకు రూ.66.28 కోట్లు, వైరా నియోజకవర్గంలో 56,673 మంది రైతులకు రూ.53.78 కోట్లు, ఇల్లందు నియోజక వర్గంలోని కామేపల్లి మండలంలోని 1,100 మంది రైతులకు రూ.73 లక్షలు జమ చేసినట్లు పేర్కొన్నారు. రైతు భరోసా పథకం ద్వారా సాగు ప్రారంభ దశలో రైతులకు అవసరమైన పెట్టుబడి సకాలంలో అందడంతో వ్యవసాయ పనులు వేగవంతంగా చేపట్టేందుకు ఈ ఆర్థిక సహాయం దోహదపడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. రైతులు తమ బ్యాంకు ఖాతాలను పరిశీలించి ప్రభుత్వం జమ చేసిన రైతు భరోసా మొత్తాన్ని నిర్ధారించుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రైతు భరోసా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి రైతుకు ఈ పథకం ప్రయోజనం అందేలా వ్యవసాయ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కల్వకుర్తిలో ప్రజాపాలన ప్రగతి యాత్ర సభ విజయవంతం

- నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, (జర్నలిస్ట్ ఫైల్) :** కల్వకుర్తిలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి యాత్ర – మహనీయుల జ్ఞాన చైతన్య బస్ టూర్ విజయోత్సవ బహిరంగ సభ"ను ఘనవిజయం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. తెలియజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.ఈ కార్యక్రమానికి విచ్చేసి సభను విజయవంతం చేసిన నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి,ఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మీడియా ప్రతినిధులు,అభిమానులు మరియు వేలాదిగా తరలివచ్చిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు.మీ అందరి సహకారం, అంకితభావం మరియు విశ్వాసమే ఈ విజయానికి కారణం. ఇదే ఉత్సాహం, ఇదే ఐక్యతతో ప్రజాసేవలో ముందుకు సాగుదాం.మరొక్కసారి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.తెలియజేసిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

# వందశాతం సబ్సిడీపై అధిక దిగుబడి పత్తి విత్తనాల పంపిణీ

## - మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారాం రెడ్డి





**తిరుమలాయపాలెం, (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమలాయపాలెం మండలం: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచడం, అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో అమలు చేస్తున్న కప్పాస్ కాంతి పథకం కింద తిరుమలాయపాలెం మండల రైతు వేదికలో రైతులకు 100 శాతం సబ్సిడీపై అధిక ఉత్పాదక పత్తి విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నా రెడ్డి సీతారాం రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలతో పత్తి సాగు చేపట్టాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించి, సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు.పథకం ద్వారా అర్హులైన రైతులకు పూర్తిగా ఉచితంగా పత్తి విత్తనాలను అందిస్తున్నామని, రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంట నిర్వహణ చేపట్టాలని కోరారు. రైతులు పంటలో సమతుల్య ఎరువుల వినియోగం, సమయానికి కలుపు నివారణ, చీడపీడల నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతు వేదిక సభ్యులు, పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారాం రెడ్డి, మేడిద పల్లి గ్రామ సర్పంచ్ మోర అనిల్ రెడ్డి, తిరుమలాయపాలెం సర్పంచ్ ధరావత్ సుజాత నరసింహారావు, మండల ఏఈవోలు, రైతులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు

## మంత్రి నారా లోకేష్ పంపిన పెళ్లి కానుక అందజేత



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) : తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామానికి చెందిన సింహాద్రి శ్రీనివాసరావు--ఆదిలక్ష్మి దంపతుల కుమారుడు గౌతమ్, లోహితల వివాహ వేడుకలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పంపిన పెళ్లి కానుకను మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు కొమ్మారెడ్డి కిరణ్ (నాని) అందజేశారు.

నూతన వధూవరులను అభినందిస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో కొనసాగాలని మంత్రి తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గుండిమెడ గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గుండిమెడ రమేష్ బాబు, కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, అనుమోలు వెంకయ్య, గుండిమెడ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## సర్కార్ ఎక్స్ ప్రెస్ దోపిడీ కేసులో కీలక నిందితుడు అరెస్ట్: రైల్వే డిఎస్పి అక్కేశ్వరావు



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) : జూన్ 14వ తేదీన బాపట్ల జిల్లా అప్పికట్లల సమీపంలో అర్ధరాత్రి సర్కార్ ఎక్స్ ప్రెస్ లో దోపిడీ చేసిన రాజస్థాన్‌కు చెందిన బావరియా గ్యాంగ్ ముఠా లో కీలక వ్యక్తి ముఖేష్‌గా గుర్తించి అరెస్టు చేసినట్లు రైల్వే డిఎస్పి అక్కేశ్వరావు తెలియజేశారు. నిందితుడు దగ్గర్నుండి 75 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం ఆరుగురు సభ్యుల ఉన్న ముఠాలోని వారిని ఇప్పటివరకు ఇద్దరుని అరెస్ట్ చేసినట్లు మిగతావారు కూడా త్వరలోనే అరెస్టు చేయటం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ గ్యాంగు చాలా క్రూరమైన నేరాలు చేస్తూ, మనుషుల యొక్క ప్రాణాలను అవలీలాగా తీస్తారని ఆయన తెలియజేశారు. రైలులో దోపిడీ జరిగిన రోజు కూడా రైల్వే పోలీస్‌ల పై మరియు ప్రజలపై రాళ్లతో దాడి చేశారని ఆయన అన్నారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. నిందితుడు ముఖేష్ ని విజయవాడ రైల్వే కోర్టుకి హాజరపురుస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా రైల్వే పోలీస్ అధికారులు డి.ఎస్.పి అక్కేశ్వరరావు అభినందించారు.

## తెనాలిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) : పట్నంలోని కొన్ని ప్రాంతాల్లో 11KV విద్యుత్తు లైన్లు మరమ్మత్తులు చేయునిమిత్తం అదేవిధంగా లైన్లకు అడ్డం ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు జరుగుతున్న కారణంగా బాలాజీ రావు పేట, రైల్వే స్టేషన్ రోడ్డు, మసీద్ సెంటర్, శివాజీ చౌక్, కవిరాజాపార్క్ ప్రాంతాలలో ఉదయం ఎనిమిది గంటల నుండి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయునట్లు కావున వినియోగదారులు డిపార్ట్మెంట్ వారికి సహకరించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. అశోక్ కుమార్ కోరారు.

## పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత..

### ప్రశ్న రావణ్‌ను అప్పగించాలంటూ ఆందోళన



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడనే ఆరోపణలతో అరెస్టయిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చలకూరి జోసెఫ్) విషయంలో కృష్ణా జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం జిల్లాలోని ఇనగుదురు పోలీస్ స్టేషన్‌లో ఉన్న రావణ్‌పై దాడి చేసేందుకు జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి, స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ తీవ్ర గందరగోళం ఏర్పడింది. పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టిన జనసైనికులను అదుపు చేయడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. స్టేషన్ చుట్టూ భద్రతా వలయం ఏర్పాటు చేసినప్పటికీ, కొందరు కార్యకర్తలు పోలీసులను తోసుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు జనసైనికులు గోడ దూకి పోలీస్ స్టేషన్ ఆవరణలోకి ప్రవేశించగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బయటకు పంపించారు. అంతకుముందు కాకినాడ జిల్లా కోర్టుల్లో రెండు వేర్వేరు కేసుల్లో బెయిల్ పొందిన రావణ్‌ను, ఇనగుదురు పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసులో అరెస్ట్ చేసి ఇక్కడికి తరలించారు. గురువారం కూడా కాకినాడ జిల్లా సర్పవరం పోలీస్ స్టేషన్ వద్ద ఇలాంటి వాతావరణమే కనిపించింది. రావణ్‌ను తమకు అప్పగించాలంటూ జనసైనికులు ఆందోళన చేయడమే కాకుండా, అతడిని తరలిస్తున్న వాహనంపై కోడిగుడ్లు విసిరారు.

జూన్ 28న ఏలూరులో జరిగిన ఓ సమావేశంలో పవన్ కల్యాణ్‌పై వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో పిఠాపురం పోలీసులు తొలుత రావణ్‌ను హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. ఆ కేసులో బెయిల్ రాగానే సర్పవరం పోలీసులు, అక్కడ బెయిల్ రాగానే ఇనగుదురు పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలా ఒకదాని తర్వాత ఒకటి కేసులు నమోదు చేసి, అరెస్టులు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

# ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యం : ఎమ్మెల్యే నసీర్

- రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుతమైన ఫలితాలు
- విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కృషితో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు
- రూ.4.50 కోట్లతో బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మించాం
- విద్యార్థులకు జామంట్రీ బాక్సులు పంపిణీ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేశామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లో విద్యార్థులకు దాతల సాయంతో జామంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి ఒక్క తట్ట మట్టి కూడా వేయలేదని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి విషయంలోనూ తీవ్ర నిర్లక్ష్యం వహించారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక మొదటి ఫైల్ గా బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం చేపట్టానని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో రూ.4.50 కోట్లతో అత్యాధునిక వసతులతో 260 మంది విద్యార్థులకు సరిపడా బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. హాస్టల్ నుంచి ఉర్దూ బాలుర పాఠశాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆర్టీసీ వారితో మాట్లాడి బస్సు ఏర్పాటు చేయించానన్నారు. విద్యార్థులకు జామంట్రీ బాక్సులు లేవని చెప్పడంతో దాతలు మిర్చియార్డు డైరెక్టర్ కొనకళ్ల సత్యనారాయణ, కోట శేషగిరి సహకారంతో 135 మందికి అందించామని చెప్పారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని తెలిపారు.

ఈ కారణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫొటోలు పేపర్లలోని మొదటి పేజీల్లో ప్రచురితమయ్యే ఫలితాలు సాధించారన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలను సందర్శిస్తూ అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, మెటీరియల్స్ అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలల ప్రారంభానికి ముందే పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, విజయ్ కుమార్, ఫారూక్, గోల్డ్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- గ్రీవెన్స్ డేలో వినతులు స్వీకరించిన ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే "పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొని, జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నుంచి వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు, ఇతర పరిపాలనా అంశాలపై వచ్చిన అర్జీలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సిబ్బంది సమస్యలను సకాలంలో పరిష్కరించడం వల్ల విధి నిర్వహణలో సామర్థ్యం, అంకితభావం మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. బదిలీలు, ఇతర పరిపాలనా నిర్ణయాలను ఖాళీలు, అవసరాలు, శాఖ నిబంధనలను పరిగణనలోకి తీసుకొని పారదర్శకంగా అమలు చేస్తామని తెలిపారు.

పోలీస్ సిబ్బంది ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచించారు. సిబ్బంది సంక్షేమం మెరుగుపడితేనే ప్రజలకు మరింత సమర్థవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించగలమన్నారు. విధి నిర్వహణలో ప్రతి పోలీసు ఉద్యోగి క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధత పాటిస్తూ ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు.

పోలీస్ శాఖ ఒక కుటుంబమని, పరస్పర సహకారం, సమన్వయం, గౌరవంతో పనిచేసినప్పుడే సంస్థ మరింత బలోపేతం అవుతుందని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# సీనియర్ జర్నలిస్టు పుట్టా శ్రీనివాసరావు కన్నుమూత




మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ): మంగళగిరికి చెందిన సీనియర్ జర్నలిస్టు, సాహితీవేత్త పుట్టా శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం కన్నుమూశారు. నగరంలోని భార్గవపేటకు చెందిన పుట్టా శ్రీనివాసరావు సీకే విద్యా సంస్థల్లో విద్యాభ్యాసం కొనసాగించారు. 1984లో బీకాం ఉత్తీర్ణులైన వీరు వెనువెంటనే విజయవాడ ఆంధ్రజ్యోతి కార్యాలయంలో చేరి... సర్క్యులేషన్ విభాగంలో సుదీర్ఘకాలం చేశారు. తదుపరి గుంటూరు ఆంధ్రజ్యోతి యూనిట్ లో ఎడిటోరియల్ విభాగంలోకి మారిన పుట్టా సీనియర్ సబ్ ఎడిటర్ హోదాలో 2022 జూలైలో రిటైరయ్యారు. తొలినుంచి స్నేహానికి విలువనిచ్చే పుట్టా పాత్రికేయ రంగంలోనూ అదేరీతిలో కొనసాగారు. స్వతహాగా సాహిత్యాభిమాని అయిన పుట్టా ప్రముఖ రచయితల రచనలు అనేకం చదివారు. ఆచరణలోనూ పెట్టారు. మంగళగిరిలో శ్రీ వేంకటేశ్వర యోగ సేవాకేంద్రం తొలినాళ్లలో క్రియాశీలకంగా సేవలందించారు. అలాగే, మంగళగిరి ప్రాంతంలో సాహిత్యపరమైన సభలు, సమావేశాల్లో విస్తృతంగా పాల్గొనడమేకాకుండా కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

తాను ఉద్యోగ జీవితం ఆరంభించిన ఆంధ్రజ్యోతిలోనే చివరివరకు కొనసాగడం పుట్టా శ్రీనివాసరావుకు వృత్తి పట్ల గల నిబద్ధత, క్రమశిక్షణకు నిదర్శనం. ఓ వైపు ఉద్యోగ బాధ్యతలు, మరోవైపు సామాజిక, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల్లోనూ అదే నిబద్ధతతో సేవలందించడం పుట్టాలోని సాహిత్య జిజ్ఞాసకు తార్కాణం. ఇంత బిజీ జీవితంలోనూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పోస్టుగ్రాడ్యుయేషన్ (సోషియాలజీ) ప్రైవేటుగా పూర్తిచేయడం... అలాగే, కంప్యూటర్ యుగం తొలినాళ్లలోనే పీజీ డిప్లమో చేయడం... అందులోనూ ప్రావీణ్యం పొందారాయన. ప్రస్తుతం మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో గల ఆర్ ఆర్ టవర్స్ లో నివాసం ఉంటున్న పుట్టా శ్రీనివాసరావు భార్య రజని, ఇద్దరు కుమారులు అరవింద్, అభినయ్ ఇంజనీరింగ్ విద్యలో పట్టభద్రులై ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మంగళగిరి ప్రాంతంలో వివిధ రంగాల ప్రముఖులతో సాన్నిహిత్యం గల సీనియర్ జర్నలిస్టు పుట్టా శ్రీనివాసరావు మృతి పట్ల సాహితీమిత్రులు, జర్నలిస్టు మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. పుట్టా మృతికి సంతాపం తెలియజేస్తూ....ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. పుట్టా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# పసిడి మళ్లీ పరుగు.. రూ.1.50 లక్షల మార్కు దాటిన బంగారం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు మళ్లీ ఒక్కసారిగా పుంజుకున్నాయి. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 3,300 మేర పెరిగి రూ. 1,50,800కి చేరింది. దీంతో పసిడి ధర మరోసారి కీలకమైన రూ. 1.50 లక్షల మార్కును దాటింది. అంతకుముందు రోజు ఈ ధర రూ. 1,47,500 వద్ద ముగిసింది. బంగారంతో పాటు వెండి ధర కూడా భారీగా పెరిగింది. కిలో వెండి ధర రూ. 5వేలు వృద్ధి చెంది రూ. 2.45 లక్షల కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల ధోరణులు దేశీయ ధరలపై ప్రభావం చూపాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను దూకుడుగా పెంచకపోవచ్చనే అంచనాలు బలపడటంతో, పెట్టుబడిదారుల తిరిగి పసిడి వైపు మొగ్గుచూపుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 57 డాలర్లు పెరిగి 4,181 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. గత కొన్ని వారాలుగా బంగారం ధరలు గరిష్ఠస్థాయిల నుంచి దాదాపు 10 శాతం మేర తగ్గిన విషయం తెలిసిందే. దీంతో కొందరు పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు, మరికొందరు ధరలు ఇంకా తగ్గుతాయనే అంచనాలతో విక్రయాలకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే, అమెరికాలో ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తోందన్న సంకేతాలతో పాటు డాలర్ బలహీన పడటం వంటి అంశాలు పసిడి ధరలకు మళ్లీ ఊతమిచ్చాయి. ఫలితంగా సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారానికి డిమాండ్ పెరిగింది. రాబోయే రోజుల్లో బంగారం ధరల గమనం అంతర్జాతీయ పరిణామాలపైనే ఆధారపడి ఉంటుంది. జూలై 8న విడుదలయ్యే అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశపు 'మినిట్స్' అత్యంత కీలకం కానున్నాయి. ఈ నివేదిక వెలువడిన తర్వాత బులియన్ మార్కెట్‌కు దిశానిర్దేశం లభించవచ్చని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఎస్.ఐ.ఆర్‌లో ప్రజలు భాగస్వామ్యం కావాలి : జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) : ఓటరు ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఎస్.ఐ.ఆర్ పై కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్.ఐ.ఆర్ బాగా జరుగుతోందన్నారు. జిల్లా యంత్రాంగం పూర్తిగా ఇందులో నిమగ్నమై ఉందన్నారు. జిల్లాలో ఏడు నియోజక వర్గాలలో 18,02,074 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎస్.ఐ.ఆర్ కు ముందు 73 శాతం మ్యాపింగ్ పూర్తి అయిందని చెప్పారు. గత నెల 14వ తేదీ నుండి ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ జరుగుతోందని, జూలై 14వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు.

ఇప్పటి వరకు 41.88 శాతం డిజిటలైజేషన్ పూర్తి జరిగిందని అన్నారు. బూత్ స్థాయి అధికారులు 98 శాతం మేర ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేశారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారు బుక్ ఎ కాల్ విధానంలో బి.ఎల్.ఓతో మాట్లాడితే ఫారాలు అందిస్తారని చెప్పారు. ప్రజలు క్రియాశీలంగా భాగస్వామ్యమై బి.ఎల్.ఓల నుండి ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకుని, వాటిని పూర్తి చేసి సంతకం చేసి అందించాలని విజ్ఞప్తి చేశారు. సంతకం చేయని ఫారాలను వెనుకకు పంపించడం జరుగుతోందని తెలిపారు.

ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేయుటకు అవసరమైతే అధికారుల సహాయం పొందవచ్చని తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని రాజకీయ పార్టీలను కోరడం జరిగిందని చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారాలను బి.ఎల్.ఓలు మాత్రమే పంపిణీ చేస్తారని, నింపిన ఫారాలను బి.ఎల్.ఓలతో పాటు బి.ఎల్.ఏ లు కూడా సేకరించి అందించవచ్చని తెలిపారు. రోజుకు లక్షకు పైగా ఫారాలను డిజిటలైజేషన్ చేస్తున్నామని అన్నారు. ఎస్.ఐ.ఆర్ లో విధులు పట్ల అలసత్వం వహించే వారి పట్ల చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. నిష్పక్షపాతంగా ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులతో అన్ని స్థాయిలలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఇతర ప్రాంతాలు, దేశాలకు వెళ్ళి ఉంటే వారిని ఫోన్ లో సంప్రదించి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. 2002 నాటి ఓటరు జాబితాలో పేరు ఉంటే సరిపోతుందని వివరించారు. 2002లో ఏ నియోజక వర్గంలో ఉన్నారో తెలిపితే సరిపోతుందని, తద్వారా జాబితాలో పరిశీలించి నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. ఓటరు జాబితాలో నమోదుకు ఏ చిన్న ఆధారం చూపించినా సరిపోతుందని తెలిపారు. 2002 నాటి ఓటరు జాబితాలో పేరు లేనివారు తమ తల్లిదండ్రుల వివరాలు సమర్పించాలని అన్నారు.

**శని, ఆదివారాలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం**

ప్రతీ శని, ఆదివారాలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ చెప్పారు. బి.ఎల్.ఓలు బూత్ స్థాయిలో అందుబాటులో ఉంటారని అన్నారు.

ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే గళ్లా మాధవి స్పందన



- ప్రజా గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ.. అధికారులకు తక్షణ చర్యల ఆదేశం

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆయా సమస్యలపై వెంటనే స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

## జూలై 14లోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలి



- ఓటర్లకు కమిషనర్ కె. మయూర్ అశోక్ విజ్ఞప్తి

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు జూలై 14తో గడువు ముగియనున్నందున, ఎన్యూమరేషన్ ఫారాలు అందుకున్న ఓటర్లు వాటిని పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేసి సహకరించాలని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఈఆర్‌వో కె. మయూర్ అశోక్ కోరారు.

శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మొత్తం 2,52,062 మంది ఓటర్లకు గాను 2,46,937 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, ఇది 97.97 శాతం పంపిణీ పూర్తయినట్లేనని తెలిపారు. ఇప్పటివరకు 84,425 ఫారాలను డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు.

అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2,78,555 మంది ఓటర్లకు గాను 2,75,050 ఫారాలను పంపిణీ చేసి 98.74 శాతం ప్రక్రియను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వీటిలో 81,417 ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. గడువులోపు ఫారాలను సమర్పించి ప్రత్యేక సవరణ ప్రక్రియ విజయవంతం చేయాలని ఓటర్లకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## ఎస్.ఐ.ఆర్ పై ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని పరిశీలించిన డి.ఆర్.ఓ



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) : ఓటరు ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంపై ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి శుక్రవారం పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి ప్రత్యేక సవరణ అవగాహన కార్యక్రమం పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్ సవరణ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని చెప్పారు.

ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యక్షంగా లేనివారు (ఆబ్సెంట్), ఇతర ప్రాంతాలకు వెళ్ళినవారు (షిఫ్టెడ్), మరణించినవారు (డెడ్), డూప్లికేట్, ఇతర దేశస్థులు (ఫారినర్ లు) క్రింద ఉన్న ఓటర్లు మినహా అందరూ ఓటరు జాబితాలో ఉంటారని అన్నారు. అపోహలు అవసరం లేదని అన్నారు.

కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి ఫారం 6 సమర్పించవచ్చని, తొలగింపులకు ఫారం 7, సవరణలకు ఫారం 8 సమర్పించవచ్చని చెప్పారు. ఫారాలను బిఎల్ఓ లకు అందించాలని కోరారు. ఓటరుగా ఆన్ లైన్ లో కూడా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఈసీ నెట్ ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకోవాలని ఆ యాప్ లో ఓటరు నమోదు, వివరాలకు సంబంధించి పూర్తి సమాచారం అందుబాటులో ఉందని చెప్పారు.

అన్ని రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను (బి.ఎల్.ఎ) లను నియమించాలని కోరడం జరిగిందన్నారు. బూత్ స్థాయి అధికారి తో "బుక్ ఎ కాల్" వ్యవస్థ ద్వారా ఓటర్ల సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. 2002 సంవత్సరం ఓటరు జాబితాలో లేని వారు సంబంధిత వివరాలను అందించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరునిగా ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొని ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్) :** భట్టిప్రోలు మండలంలోని మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొని మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.

ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, రెవెన్యూ, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు, వైద్యం, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత అధికారులతో అక్కడికక్కడే చర్చించారు. పెండింగ్ సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించి, అర్హులైన వారికి త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు అందేలా "మీకోసం" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో భట్టిప్రోలు మండలానికి చెందిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లా బీజేపీ ఇన్‌చార్జిగా కొక్కెర శ్రీనివాస్ యాదవ్

○ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నియామక ఉత్తర్వులు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ రాష్ట్ర సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే క్రమంలో మార్కాపురం జిల్లా ఇన్‌చార్జిగా గుంటూరు జిల్లా మేడికొండూరు మండలానికి చెందిన కొక్కెర శ్రీనివాస్ యాదవ్‌ను రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నియమించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కొత్త ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ ప్రకటించింది.

నియామకంపై స్పందించిన కొక్కెర శ్రీనివాస్ యాదవ్, సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తనకు పార్టీ ఇంతటి బాధ్యత అప్పగించడం గర్వకారణమని అన్నారు. గత మూడు సంవత్సరాలుగా పల్నాడు జిల్లా ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవంతో మార్కాపురం జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. బూత్ స్థాయి కమిటీల విస్తరణ, సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

జిల్లా, రాష్ట్ర నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి ఎన్. మధుకర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ ఆశయాల సాధనకు తన శక్తిసామర్థ్యాల మేరకు కృషి చేస్తానని అన్నారు.

## ప్రెసిడెన్షియల్ ఆర్డర్--2025 అమలుపై ఎస్పీకి పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ వినతి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రెసిడెన్షియల్ ఆర్డర్--2025 అమలు నేపథ్యంలో పోలీస్ అధికారుల సర్వీస్ అంశాలకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుంటూరు జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా విభజన అనంతరం పరస్పర బదిలీలు, జిల్లా క్యాడర్ సీనియారిటీ, పదోన్నతులు తదితర అంశాల్లో ఉద్యోగుల హక్కులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతిపత్రంలో 1993, 1995, 1996, 1999, 2001, 2002, 2003, 2005, 2009 బ్యాచ్‌ల పోలీస్ అధికారుల సీనియారిటీ, పదోన్నతులు, సర్వీస్ ప్రయోజనాలు యథాతథంగా కొనసాగించాలని, ప్రస్తుతం విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్‌ఐలకు జోన్ పరిధిలో అమలవుతున్న అవకాశాలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆప్షన్ ఫారమ్‌ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

సుదీర్ఘకాలంగా ఉమ్మడి జిల్లాలో సేవలందిస్తున్న సిబ్బందికి సీనియారిటీ పరిరక్షణ కల్పించాలని, లోకల్ స్టేటస్ నిర్ణయంలో విద్యార్హతలు, నివాస వివరాలు, ప్రభుత్వ నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

బదిలీల సమయంలో భార్యాభర్తలు ప్రభుత్వ ఉద్యోగులైన సందర్భాలు, ఆరోగ్య పరిస్థితులు వంటి మానవతా అంశాలను కూడా పరిగణించాలని, కొత్త మార్గదర్శకాల అమలులో తలెత్తే సందేహాలను నివృత్తి చేసి ఉద్యోగుల ప్రయోజనాలకు భంగం కలగకుండా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అసోసియేషన్ ప్రతినిధుల వినతిని స్వీకరించిన ఎస్పీ వకుల్ జిందాల్, వారు ప్రస్తావించిన అంశాలను సంబంధిత నిబంధనల ప్రకారం పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. ఆరోగ్యరాజు, కార్యదర్శి ఏ.వి. శివప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లు ఆర్.ఐ. సురేష్, మైల సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ ఎం. లక్ష్మయ్య, ట్రెజరర్ ఎస్.కే. హుస్సేన్, ఏఎస్ఐ బేబీ రాణి, ఏఎస్ఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ-పంట నమోదుపై అసత్య ప్రచారం మానుకోవాలి

○ రైతులను తప్పుదోవ పట్టించే కుట్రలను ప్రజలు తిప్పికొడతారు: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఈ-పంట నమోదుపై ప్రతిపక్ష నేత జగన్, సాక్షి పత్రిక చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. అబద్ధాలకు జగన్ అంబాసిడర్ అయితే, వాటికి సాక్షి వేదికగా మారిందన్నారు. రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, కూటమి ప్రభుత్వ విజయాలు చూసి తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో ఖరీఫ్-2024లో 41.87 లక్షల మంది రైతుల 96.78 లక్షల ఎకరాలు మాత్రమే ఈ-పంట నమోదుకాగా, కూటమి ప్రభుత్వం ఖరీఫ్-2025లో 53.32 లక్షల మంది రైతుల 117.39 లక్షల ఎకరాలు నమోదు చేసి గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. రబీ 2025-26లో 99.7 శాతం నమోదు పూర్తి చేశామని, ఖరీఫ్-2026లో APAIMS 2.0 ద్వారా జియో రిఫరెన్సింగ్, కృత్రిమ మేధ, ఉపగ్రహ సాంకేతికత వంటి ఆధునిక విధానాలతో పారదర్శకంగా ఈ-పంట నమోదు చేపడుతున్నామని తెలిపారు.

కొబ్బరి ధరలపై కూడా తప్పుడు కథనాలతో మార్కెట్‌ను దెబ్బతీసే కుట్ర జరుగుతోందని మంత్రి ఆరోపించారు. గత రెండేళ్లుగా కొబ్బరి రైతులకు మంచి ధరలు లభిస్తున్నాయని, ప్రస్తుతం కూడా మార్కెట్ పుంజుకుని రైతులకు గిట్టుబాటు ధరలు వస్తున్నాయని చెప్పారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అసత్య ప్రచారాలతో ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ "మీ వద్దకు-మీ గళ్ళా మాధవి" కార్యక్రమంలో 49వ డివిజన్‌లో విస్తృత పర్యటన



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే ఉద్దేశంతో నిర్వహిస్తున్న "మీ వద్దకు - మీ గళ్ళా మాధవి" కార్యక్రమంలో భాగంగా 3వరోజు ఎమ్మెల్యే & టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి 49వ డివిజన్‌లోని 116వ బూత్ పరిధిలో విస్తృతంగా పర్యటించారు.

ఈ సందర్భంగా పీ.ఎస్. నగర్ 1, 2, 3, 4 లైన్లలో ఇంటింటికి వెళ్లి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల కొరత, వీధి కుక్కల బెడద వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల ఫిర్యాదులపై స్పందించిన గళ్ళా మాధవి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదేవిధంగా వేళంగిని నగర్ ప్రధాన రహదారి, కొండయ్య కాలనీ ప్రధాన రహదారులను విస్తరించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎస్సీ, సీపీ, టౌన్ సర్వేయర్‌లను పిలిచి రహదారి విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కొండయ్య కాలనీలో రహదారులు ఇరుకుగా ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వివరించారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశంగా భావించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులను ఆదేశించారు.

పర్యటన అనంతరం బూత్ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులందరికీ పథకాలు చేరేలా చూడడం, అలాగే పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని గళ్ళా మాధవి తెలిపారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, క్లస్టర్ మరియు బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, యూనిట్, కో-యూనిట్ నాయకులు, పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

○ గుంటూరు తూర్పు ఎమ్మెల్యేకు జేఏసీ వినతి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ప్రతినిధులు శుక్రవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్‌ను కలిసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. జేఏసీ జిల్లా ఛైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు, కన్వీనర్ ఎండి ఖాలీద్, కార్యదర్శి గార్ల ఆధ్వర్యంలో సభ్య సంఘాల నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ అమలు, సరెండర్ లీవుల నగదు చెల్లింపు, నాలుగు కరవు భత్యాల విడుదల, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు, సీపీఎస్ రద్దు తదితర మొత్తం పది ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ స్థాయిలో చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పిచ్చయ్య, జేఏసీ గుంటూరు నగర శాఖ ఛైర్మన్ చింతల కళ్యాణ్ కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ఏపీటీఎఫ్-1938 నాయకుడు మేకల సుబ్బారావు, కమర్షియల్ టాక్సెస్ శాఖకు చెందిన ఎస్.వి. రమణ, ఎడ్యుకేషన్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ట్రెజరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా ఉమెన్స్ ఛైర్‌పర్సన్ తాజ్‌నిసా, క్లాస్-4 వైస్ ప్రెసిడెంట్ వినోద్, ట్రెజరర్ నాయక్, ఫార్మసిస్ట్ జైనబి, మారుతి, కమర్షియల్ టాక్సెస్ శాఖకు చెందిన నారాయణమ్మ, గుంటూరు సిటీ కన్వీనర్ వాణి, ఎన్జీవో ఉమెన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీవాణి, ఎక్సైజ్ శాఖకు చెందిన ప్రసన్న, పే అండ్ అకౌంట్స్ శాఖకు చెందిన నాగేశ్వరరావుతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 'ఇండియన్ డోరీ'... కేరళ తీరంలో కొత్తరకం చేప



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** భారత సముద్ర జలాల్లోని అపారమైన జీవవైవిధ్యానికి నిదర్శనంగా మరో కొత్త ఆవిష్కరణ జరిగింది. కేరళ తీరంలోని అరేబియా సముద్రంలో ఐకార్-సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎమ్ఎఫ్ఆర్ఐ) శాస్త్రవేత్తలు ఒక కొత్తరకం సముద్రపు చేపను కనుగొన్నారు. ఈ ఆవిష్కరణతో దేశ సముద్ర జీవజాతుల జాబితాలో మరో కొత్త పేరు చేరింది.

ఈ చేపకు 'సైటాప్సిస్ ఇండికా' అని శాస్త్రీయ నామకరణం చేశారు. దీనిని సాధారణంగా 'ఇండియన్ డోరీ' అని పిలుస్తారు. దక్షిణ కేరళ తీరానికి సమీపంలో, తూర్పు లక్షద్వీప్ సముద్ర ప్రాంతంలో 350 నుంచి 500 మీటర్ల లోతులో దీనిని గుర్తించారు. కొల్లంలోని శక్తికులంగర ఫిషింగ్ హార్బర్‌లో సేకరించిన ఆరు చేప నమూనాల ఆధారంగా ఈ ఆవిష్కరణ చేశారు.

సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. రతీశ్ కుమార్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన చేపట్టింది. సంప్రదాయ వర్గీకరణ పద్ధతులతో పాటు, ఆధునిక డీఎన్ఏ సీక్వెన్సింగ్ విశ్లేషణ ద్వారా దీనిని కొత్త జాతిగా నిర్ధారించారు. ఈ పరిశోధనతో చాలాకాలంగా ఉన్న ఒక శాస్త్రీయ పొరపాటు కూడా సరిదిద్దబడింది. ఇంతకుముందు హిందూ మహాసముద్రంలో దొరికిన ఈ రకం చేపలను 'సైటాప్సిస్ రోసియా'గా భావించేవారు. కానీ, తాజా డీఎన్ఏ విశ్లేషణలో ఇది పూర్తిగా భిన్నమైన జాతి అని తేలింది.

'సైటాప్సిస్ రోసియా' కేవలం అట్లాంటిక్ మహాసముద్రానికే పరిమితమని స్పష్టమైంది.

ఈ కొత్త ఆవిష్కరణ వివరాలను 'ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫిషరీస్' తాజా సంచికలో ప్రచురించారు. కేరళ, లక్షద్వీప్ సముద్ర జలాల్లో ఇంకా శాస్త్రవేత్తలకు అంతుచిక్కని ఎన్నో జీవజాతులు ఉన్నాయని ఈ పరిశోధన మరోసారి నిరూపించిందని నిపుణులు అంటున్నారు. ఈ ప్రాంతాల్లో మరింత లోతుగా అన్వేషిస్తే జీవవైవిధ్య పరిరక్షణకు, మత్స్య సంపద సుస్థిర యాజమాన్యానికి దోహదపడే మరిన్ని ఆవిష్కరణలు సాధ్యమవుతాయని వారు అభిప్రాయపడ్డారు.

## మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్'కు విశేష స్పందన



○ అమరావతే ఏకైక ప్రజారాజధాని: మంత్రి దుర్గేష్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రూపకల్పన చేసిన 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' కార్యక్రమానికి విజయవాడ పార్లమెంట్ పరిధిలో విశేష స్పందన లభిస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఏడు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో ఆశావహులు దరఖాస్తులు సమర్పిస్తున్నారని, పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించేందుకు 32 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని, జనసేన కార్యకర్తల బలంతోనే ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాజధానిపై చేసిన వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు. గతంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టిన జగన్, ఇప్పుడు మరోసారి కొత్త వాదనను తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆమోదించిన ఏకైక ప్రజారాజధాని అమరావతేనని స్పష్టం చేసిన ఆయన, ఎలాంటి కుట్రలు జరిగినా అమరావతి నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం శరవేగంగా పూర్తి చేసి ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటాం



○ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

○ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

○ తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహణ

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల సమస్యలపై ప్రతినిత్యం అందుబాటులో, ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎమ్మెల్యే నసీర్ స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేపట్టాలని, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ లో స్ప్లిట్ ఆప్షన్ ఇవ్వాలని కొందరు అర్జీలు అందజేశారు. స్థానికంగా శానిటేషన్ సక్రమంగా లేదని, విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగడం లేదని, రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వెంటనే సంబంధిత అర్జీలపై అధికారులతో మాట్లాడారు. తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మిగిలిన అర్జీల పరిష్కారానికి పక్కా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించేందుకు అంచెలంచెల వ్యవస్థ ద్వారా పని చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్లామని చెప్పారు. ప్రతి వారం ప్రజాదర్బార్ మాత్రమే కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటన ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సంక్షేమాన్ని అర్హులకు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మొత్తం 67 అర్జీలు దాఖలయ్యాయని చెప్పారు.

## 2011కు ముందు నియమిత ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

○ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫోర్టో వినతి

**జమ్మలమడుగు(జర్నలిస్ట్ ఫైల్):** 2011లో టెట్ అమల్లోకి రాకముందు నియమితులైన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ రికగ్నైజ్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ అంకాల్ కొండయ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి వినతిపత్రం అందజేశారు.

జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రిని కలిసి, టెట్‌కు సంబంధం లేని ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులు కావాలని నిబంధన విధించడం సమంజసం కాదని వివరించారు. 2011కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులందరికీ టెట్ నుంచి మినహాయింపు కల్పించాలని కోరారు.

వినతిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమస్యను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు అంకాల్ కొండయ్య తెలిపారు. ఈ సందర్భంగా తమ విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించిన ముఖ్యమంత్రికి ఫోర్టో తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

○ వైద్యులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలి - జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, వైద్యులు బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని తనిఖీ చేసారు. ఆసుపత్రిలోని డాక్టర్లు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి, విధుల నిర్వహణ, షిఫ్ట్‌ల వారీగా సేవలపై ఆరా తీశారు. తదుపరి ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించారు. ప్లాస్టిక్ సర్జరీ వార్డు , నర్సింగ్ డ్యూటీ రూమ్ , జనరల్ సర్జరీ వార్డు , పీడియాట్రిక్, ఆర్థోపెడిక్ , కానూరి జింకానా ప్రసూతి వార్డు , నాట్కో క్యాన్సర్ అవుట్ పేషెంట్ బ్లాక్ లను పరిశీలించారు. ప్లాస్టిక్ సర్జరీ , ఆర్థోపెడిక్ వార్డులలో అందిస్తున్న వైద్య సేవల గురించి రోగులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు ఎక్కడ నుండి వచ్చారు , డాక్టర్లు చికిత్స ఎలా అందిస్తున్నారు, భోజనం సరిగా అందుతున్నదా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. వార్డులలోని బాత్ రూమ్స్ తనిఖీ చేసారు. టాయిలెట్స్ శుభ్రంగా వుంచాలని , వైరింగ్ సరిగా చేపట్టాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఆసుపత్రిలో అపరిశుభ్రంగా పడివున్న ఫర్నిచర్ ను చూసి ఉపయోగించుకునే అవకాశం వుంటే మరమ్మత్తులు చేయించుకోవాలని , లేదా ప్రభుత్వ నిబంధనల మేరకు వేలం ద్వారా విక్రయించాలన్నారు.

అనంతరం ఆసుపత్రి వివిధ విభాగాల హెచ్ ఓ డి లతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కానూరు జింకానా స్త్రీ ఆరోగ్య కేంద్రంలో ఫైర్ సేఫ్టీ ఆడిటింగ్ జరిగిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి మీద ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని , క్లీనింగ్ సరిగా లేదని , వార్డులలో బెడ్ షీట్స్ మార్చడం లేదని ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ ప్రశ్నించారు. వారం రోజులలో శానిటేషన్ మెరుగుపరచాలని , రోజు కొత్త బెడ్ షీట్స్ మార్చాలని ఆదేశించారు. ఆసుపత్రి పాత భవనం మొత్తం రిపేర్ చేయవలసి వుందని , గతంలో రూపొందించిన అంచనా వ్యయం సరిపోదని తెలియజేయగా , కొత్తగా అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్లాస్టిక్ సర్జరీ వార్డు మరమత్తులకు టెండర్లు పిలిచి జూలై నెల ఆఖరు నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రికి అత్యవసర పరికరాలు అవసరం మేరకు వెంటనే కొనుగోలు చేయాలని , తదుపరి ర్యాటిఫికేషన్ సమర్పించాలని సూపరింటెండెంట్ కు సూచించారు. పీడియాట్రిక్ వార్డులో రిజర్వులో వున్న పది బెడ్లను మెటర్నటి వార్డుకు మార్చుకోవడానికి అనుమతి కోరగా జిల్లా కలెక్టర్ ఆమోదించడం జరిగింది. ఆసుపత్రి అభివృద్ధికి మంజూరు అయిన నిధులను సరిగా వినియోగించాలన్నారు. నిధుల వినియోగం పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి సకాలంలో, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.టి.దుర్గా ప్రసాద్ , జాయింట్ డైరెక్టర్ డా. సిహెచ్. సుధారాణి , సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డా. బి.వెంకటేశ్వర రావు, ప్లాస్టిక్ సర్జరీ విభాగం హెచ్ ఓ డి డా. సుమిత శంకర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్, వివిధ విభాగాల హెచ్ ఓ డి లు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467